సాక్షి అనకాపల్లి

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

మానవత్వం చాటుకున్న యువకులు

ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన 'డేంజర్ గాయ్స్' సభ్యులు



వాసు, పావని దంపతులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డేంజర్ గాయ్స్ సభ్యులు

మునగపాక: స్థానిక డేంజర్ గాయ్స్ యువజన సంఘం సభ్యులు మానవత్వం చాటుకున్నారు. ఒకవైపు గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ మరోవైపు సోషల్ మీడియా ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. విశాఖలో గోపాలపట్నానికి చెందిన పావని, వాసు దంపతులకు కుమారుడు అయాన్షేజా. ఆ బాబు బోన్ మేరో వ్యాధితో సతమతమవుతున్నాడు. ఇందుకుగాను సర్జరీ చేయాల్సి ఉంది. బాబు తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో సర్జరీ చేయించలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మునగపాకకు చెందిన యూ ట్యూబర్ సునీల్‌తో అనకాపల్లికి చెదిన యూ ట్యూబర్ మురళి.. అలాగే డేంజర్ గాయ్స్ సభ్యులు కలిసి సోషల్ మీడియా ద్వారా మరింత ప్రచారం చేసి పలువురి నుంచి రూ.1,70,500 నగదును సేకరించారు. సేకరించిన నగదును వాసు, పావని దంపతులకు అందజేశారు.

ప్రమాదస్థాయికి 'కోనాం' నీటిమట్టం

300 క్యూసెక్కుల విడుదల

చీడికాడ: కోనాం జలాశయం పరిసరాల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో ఇన్‌ఫ్లో భారీగా పెరగడంతో జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరువలో ఉందని ఇన్‌చార్జి ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 99.80 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో ఒక్కసారిగా 400 క్యూసెక్కులకు పెరగడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నుంచి ప్రధాన గేట్ల ద్వారా దిగువకు 300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి రాత్రికి నీటి విడుదలను పెంచే అవకాశం ఉందన్నారు.

అపచారం


పరమ పావనమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి పుష్కరిణిని అపవిత్రం చేసేందుకు నడుం బిగించారు. భక్తులు బంధుర సరస్సుగా పిలిచే ఈ పవిత్ర జలాలను ఆనుకొని ఉన్న పెద్ద చెరువులో చేపల పెంపకానికి సిద్ధపడ్డారు. అందుకోసం వేలం కూడా వేశారు. టీటీడీ నిబంధనలకు, ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా కూటమి నేతల ఆధ్వర్యంలోనే ఇదంతా జరగడంతో తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి.



ఉపమాక ఆలయానికి ఉత్తర ముఖంగా ఉన్న పెద్ద చెరువు

- ➤ ఉపమాక వెంకన్న చెరువుల్లో చేపల పెంపకానికి వేలం
- ➤ స్వామి పుష్కరిణిని అపవిత్రం చేసేందుకు సిద్ధమైన కూటమి నేతలు
- ➤ గుట్టుచప్పుడు కాకుండా లీజు హక్కులు
- ➤ మూడేళ్ల కాలపరిమితికి రూ.7 లక్షలకు బేరం
- ➤ భక్తుల నుంచి తీవ్ర విమర్శలు
- ➤ తమ దృష్టికి రాలేదంటున్న టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్

నక్కపల్లి: లక్షలాది మంది ప్రజలు ఎంతో భక్తితో కొలిచే ఉపమాక వేంకటేశ్వరస్వామివారికి చెందిన చెరువులపై పెత్తనానికి కూటమి నేతలు తెర తీశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా పవిత్రమైన ఆ జలాల్లో చేపలు పెంచేందుకు వేలం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి తెలియకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఇదంతా జరిగినట్టు సమాచారం. మూడేళ్ల కాలపరిమితికి రూ.7 లక్షలకు ఉపమాకకు చెందిన ఒక వ్యక్తి చేపలు పెంచుకునే లీజు హక్కును దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలో ప్రముఖ పుణ్యక్షేత్రం, టీటీడీ అనుబంధ ఆలయం ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఉపమాక పరిధిలో సర్వే నెంబరు 121లో 5.40 ఎకరాల విస్తీర్ణంలో చిన్న చెరువు (స్వామివారి పుష్కరిణి) సర్వే నెంబరు 123లో 32 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉన్నాయి. రెండు చెరువులు ఒకదానికొకటి ఆనుకుని ఉంటాయి. చిన్న చెరువును పుష్కరిణిగా భావిస్తూ దీంట్లో నీటిని శతాబ్దాల కాలం నుంచి స్వామివారి కైంకర్యాల్లోను, సేవల్లోను, అభిషేకాలకు, భక్తులకు తీర్థం ఇచ్చేందుకు ఉపయోగిస్తుంటారు. బంధుర సరస్సు, పుష్కరిణిగా పేర్కొనే ఈ చిన్న చెరువులో బ్రహ్మ తపస్సు చేశాడని క్షేత్ర మహాత్మ్యం ద్వారా తెలుస్తోంది. పెద్ద చెరువు పూర్తిగా నిండిపోయిన తర్వాత చిన్న చెరువులోకి నీరు చేరుతుంది. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న సమయంలో ఈ పెద్ద చెరువులో చేపలు పెంచుకునే హక్కును లీజుకు ఇచ్చేవారు. పదేళ్ల క్రితం ఉపమాక ఆలయాన్ని టీటీడీ వారు స్వాధీనం చేసుకున్న తర్వాత ఆలయానికి చెందిన చర, స్థిరాస్తులన్నీ టీటీడీ పరిధిలోకి వెళ్లిపోయాయి. దీంతో ఆలయ నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ కోసం టీటీడీ వారు ఇక్కడ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమించారు. టీటీడీ ఆధీనంలోకి వెళ్లిన తర్వాత ఈ చెరువుల పరిరక్షణ బాధ్యత వారే చూస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో వేంకటేశ్వరస్వామి తిరుమల తిరుపతి దేవస్థానం ఖాతా నెంబరు 2086లో నమోదై ఉన్నాయి. టీటీడీ వెబ్‌సైట్‌లో సీరియల్ నెంబరు 689, 690లుగా ఈ రెండు చెరువులు టీటీడీ వారికి చెందిన ఆస్తిగా నమోదయ్యాయి.



రెవెన్యూ రికార్డుల్లో టీటీడీ పేరున నమోదై ఉన్న చెరువులు



స్వామివారి పుష్కరిణి

భక్తుల విశ్వాసాలకు విఘాతం

ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో జరిగే కల్యాణోత్సవాల్లో వేలాది మంది భక్తులు బంధుర సరస్సులో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకోవడం అనాదిగా వస్తోంది. ఇక్కడ స్నానం చేసి దర్శనం చేసుకుంటే సంతానం కలుగుతుందనేది భక్తుల నమ్మకం. అంత పవిత్రంగా ఈ చిన్న చెరువును భావిస్తారు. దీన్ని ఆనుకుని ఉన్న పెద్ద చెరువుపై గ్రామానికి చెందిన కొంతమంది పెద్దల కళ్లు పడ్డాయి. గ్రామాభివృద్ధి పేరుతో చేపలు పెంచుకునేందుకు లీజుకు ఇవ్వడానికి నిర్ణయించారు. చాలా రోజుల నుంచి ఈ ఆలోచన ఉన్నప్పటికీ కొంతమంది నుంచి వ్యతిరేకత రావడం, భక్తుల నుంచి కూడా విమర్శలు వస్తాయనే ఉద్దేశంతో వాయిదా వేశారు. శనివారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా దేవస్థానం వారికి తెలియకుండా కొంత మంది పెద్దలు సమావేశమై చెరువుకు వేలం నిర్వహించినట్లు భోగట్టా. మూడేళ్ల కాలపరిమితికి రూ.7 లక్షలకు ఉపమాకకు చెందిన ఒక వ్యక్తి ఈ లీజు హక్కు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముందుగా రూ.2 లక్షలు గ్రామ పెద్దలకు చెల్లించిన తర్వాత చెరువులో చేపపిల్లలు వేసుకోవాలనే కండీషన్ విధించి ఒప్పంద పత్రాలు కూడా రాసుకున్నట్లు చెప్పుకుంటున్నారు. భక్తుల సెంటిమెంట్‌లను గౌరవించాల్సిన పెద్ద మనుషులే ఇలా అపచారానికి ఒడిగట్టడంపై భక్తులు మండిపడుతున్నారు.

చేపల పెంపకంతో అపవిత్రం

టీటీడీ నిబంధనలు, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం దేవస్థానానికి చెందిన చెరువుల్లో చేపల పెంపకం అనేది పూర్తిగా నిషిద్ధం. పెద్ద చెరువులో చేపలు పెంచితే వాటికి ఆహారంగా కోళ్ల వ్యర్థాలు, మాంసం ముక్కలు, ఇతరత్రా పదార్థాలు వేస్తారు. వీటితో కలుషితమయిన నీరు పుష్కరిణిలో చేరితే అపవిత్రమవుతుంది. అభిషేకాలకు, తీర్థానికి ఈ నీరు పనికిరాదు. అలాగే పుణ్యస్నానాలకు కూడా పనికి రాదు. ఈ నేపథ్యంలో ఉపమాకలో దేవస్థానానికి చెందిన చెరువులను బయట వ్యక్తులు ఏ విధంగా వేలం నిర్వహిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేలం ద్వారా వచ్చిన ఆదాయం టీటీడీకి కాకుండా గ్రామ దేవత పండగల కోసం కేటాయించేందుకు నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. పెద్ద చెరువును నక్కపల్లి, ఉపమాక తదితర గ్రామాలకు చెందిన వారు ఎవరైనా మరణిస్తే ధర్మోదకాలకు, దహన సంస్కారాలు పూర్తి చేసిన తర్వాత స్నానాలు చేసేందుకు ఉపయోగిస్తుంటారు. ఈ విషయంపై టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును వివరణ కోరగా ఈ రెండు చెరువులు టీటీడీ పరిధిలో ఉన్నాయన్నారు. వేలం నిర్వహించిన విషయం తనకు తెలియదన్నారు. టీటీడీ నిబంధనల ప్రకారం చెరువుల్లో చేపల పెంపకం పూర్తిగా నిషేధమన్నారు. తమ అనుమతి లేకుండా ఎవరైనా చెరువుల్లో చేపలను వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

జనారణ్యంలో జింక

- వాహనం ఢీకొని తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ మృతి



ఘటనా స్థలంలో రక్తమోడుతున్న జింక

అనకాపల్లి టౌన్: ప్రజలు అడవులను ఆక్రమించడంతో దారి తప్పిన ఆ జింక జనారణ్యంలో అడుగు పెట్టింది. అనకాపల్లి మండలం శంకరం గ్రామం వద్ద కొండ దిగి జాతీయ రహదారిపై సంచరిస్తుండగా.. అదుపు తప్పిన ఓ వాహనం శనివారం అర్ధ రాత్రి ఢీకొంది. దీంతో జింక రెండు కాళ్లకు గాయాలై కదలలేని స్థితిలో రక్తపు మడుగులో అచేతన స్థితిలో ఉండిపోయింది. ఆదివారం తెల్లవారుజామున అదే రూట్‌లో మరో వాహనంలో వెళుతున్న వ్యక్తులు చూసి జింక కాళ్లకు కట్టు కట్టి పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఫారెస్ట్ అధికారులు ప్రాథమిక చికిత్స చేసి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ మృత్యువుతో పోరాడి జింక మృతి చెందినట్లు అనకాపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి జ్యోతిర్మయి తెలిపారు.

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూపీ అదనపు డీజీపీ సత్యనారాయణ

నర్సీపట్నం: తెలుగు సాహిత్యాన్ని మహాకవి గురజాడ అప్పారావు సుసంపన్నం చేశారని యూపీ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషి చేసిన గొప్పకవి గురజాడ అని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి కావలసిన పుస్తకాలు గురించి గ్రంథాలయ అధికారి దమయంతిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన పుస్తకాలను పంపిస్తానని హామీచ్చారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ సేవలను పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుదిపేసిన కుండపోత

- ఈదురుగాలులకు కూలిన చెట్లు.. తెగిపడిన విద్యుత్ వైర్లు
- నేలకూలిన ఇళ్లు.. చెట్లు పడి దెబ్బతిన్న వాహనాలు

జిల్లాలో పలుచోట్ల జనజీవనం అస్తవ్యస్తం

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలోని యలమంచిలి, మునగపాక మండలాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోతగా కురిసిన వర్షానికి లోతట్టుప్రాంతాలు మునిగాయి. యలమంచిలిలో గంట వ్యవధిలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణంలో పలు వీధులు,అంతర్గత రహదారుల్లో పదుల సంఖ్యలో చెట్లు నేల కొరిగాయి.కొన్ని చోట్ల నిలిపి ఉంచిన కార్లు,బైక్‌లపై చెట్లు,చెట్ల కొమ్మలు పడడంతో ఆ వాహనాలు దెబ్బతిన్నాయి. భవనంవీధిలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. పలు చోట్ల విద్యుత్ వైర్లు తెగిపడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లైనుకొత్తూరు వద్ద పాత జాతీయ రహదారిపై భారీ చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయి,హెచ్‌టీ లైన్ల వైర్లు తెగిపోయాయి.ఆ మార్గం మీదుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.విద్యుత్,పోలీసు శాఖల అధికారులకు సమాచారం అందించినట్లు తహసీల్దార్ కె.వరహాలు తెలిపారు.కొక్కిరాపల్లిలో పిడుగు పడి కీర్తి లక్ష్మికి చెందిన గేదె మృతి చెందింది. పట్టణంలోని రాంనగర్‌లో ఓ ఇంటిపై చెట్టు కూలడంతో పాక్షికంగా దెబ్బతింది. కూలిన చెట్లను తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఇంజినీర్లు గణపతిరావు, నానాజీ, సిబ్బంది పొక్లెయిన్‌లతో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. రోడ్లపై కూలిన చెట్లను తొలగించి, ఆదివారం సాయంత్రం 6 గంటలకు చాలావరకు రాకపోకలు పునరుద్ధరించగలిగారు. వర్షంతో కొన్నిచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో పాదచారులు నడిచి వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో అరటి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. వరి,ఇతర పంటలకు ఈ వర్షం బాగా మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

మునగపాకలో...

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో మాదిరిగా భారీగా గాలులు వీయడంతో పాటు కుండపోతగా వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మునగపాక మెయిన్‌రోడ్డులో ఆడారి చంద్రమోహన్ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ద్విచక్ర వాహనంపై కొబ్బరి చెట్టు పడడంతో వాహనం నుజ్జయింది. మునగపాక బీసీ కాలనీలో పై అంతస్తులో ఏర్పాటు చేసుకున్న షెడ్‌లు దెబ్బతిన్నాయి. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ సత్యనారాయణకు బాధితులకు విన్నవించారు.కాగా విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ ఏఈ శరగడం జగదీష్ చర్యలు తీసుకున్నారు.



మునగపాక మెయిన్‌రోడ్డులో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు



యలమంచిలి ఎల్ఐసీ వీధిలో కారుపై కూలిన చెట్టు



మునగపాకలో ద్విచక్ర వాహనంపై పడిన చెట్టు



యలమంచిలిలో చెట్టు పడి కూలిన విద్యుత్ స్తంభం




లైనుకొత్తూరు వద్ద పాతజాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

అమ్మా.. నీవే శరణంటూ..

నేటి నుంచి శరన్నవరాత్రులు ● ఊరూరా విస్తృత ఏర్పాట్లు




అనకాపల్లి గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారి ఆలయం



మాడుగులలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకంగా అలంకరించిన దేవీతల్లి

దేవీ నవరాత్రుల సందడి మొదలవుతోంది. సోమవారం నుంచి అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులను అనుగ్రహించనున్నారు. ఆశ్వయుజ మాసం ప్రారంభం నాటి నుంచి విజయదశమి వరకు జరిగే ఈ వేడుకల కోసం జిల్లా అంతటా ఊరూరా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లిలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారు, సత్యనారాయణపురం కొండపైన వెలసిన కనకదుర్గమ్మ, గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మలను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రానుండడంతో అధికారులు, ఆలయ వర్గాలు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. నూకాంబిక అమ్మవారి బాలాలయంలో నిర్వహించే దసరా ఉత్సవాలను దేవదాయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి పర్యవేక్షించనున్నారు. అలనాటి మహారాజులు సంప్రదాయబద్ధంగా నిర్వహించే నవరాత్రుల కోసం మాడుగుల ముస్తాబైంది. ఇక్కడి సివిల్ ఆర్టీసీ ఆటో మోటారు ఓనర్స్, వర్కర్స్ యూనియన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహించడానికి నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేసింది.

– అనకాపల్లి/మాడుగుల



అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారు



నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్లు

క్లుప్తంగా

సరుగుడు జలపాతం వద్ద సందడి



నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి నెలకొంది. నీటిలో జలకాలు ఆడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులు కాలక్షేపం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సందర్శకులు తరలిరావడంతో సరుగుడు రోడ్డులో వాహనాలు రాకపోకలు పెరిగాయి. తాండవ రిజర్వాయరు వద్ద కూడా సందర్శకులు తాకిడి కన్పించింది. తాండవ ప్రాజెక్టు దిగువనున్న నల్లగొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో గల పార్కులో పర్యాటకులు ఆటపాటలతో సరదాగా గడిపారు.

నేడు హైకోర్టులో పైడమ్మ చెరువు హక్కులపై విచారణ

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురం గ్రామానికి ఆనుకొని ఉన్న పైడమ్మ చెరువు హక్కుల విషయంలో హైకోర్టులో ఈనెల 22న విచారణ జరగనుంది. ఈ గ్రామానికి చెందిన ఇద్దరు సంప్రదాయ మత్స్యకారులు ఈనెల 15న హైకోర్టులో పిటిషన్ వేయగా కేసును 17న స్వీకరించారు. దీనికి సంబంధించి 9 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ 22న విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే పైడమ్మ చెరువు హక్కుల కోసం కొత్తపేటకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పుపై మత్స్యకార గ్రామాల్లో ఉత్కంఠ ఏర్పడింది.

జిలిటెన్ స్టిక్స్ స్వాధీనం

అనకాపల్లి టౌన్: మండలంలోని వేట జంగాలపాలెంలో క్వారీ వద్ద నిల్వ ఉంచిన జిలిటెన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ ఆదివారం తెలిపారు. నిల్వ ఉంచిన వారు, సరఫరా చేసిన వారి వివరాలపై ఆరా తీసి, సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ కమిషనరేట్‌కు స్కోచ్ అవార్డు



పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన స్కోచ్ అవార్డు

అల్లిపురం: రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం అందించే ప్రత్యేక కేంద్రానికి ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు లభించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లుగా విశాఖ పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసిన ఈ సహాయ కేంద్రం ద్వారా, 69 రోడ్డు ప్రమాద కేసులలో బాధితులకు రూ.63.50 లక్షల పరిహారం అందించారు. ఈ సేవా కార్యక్రమానికి గుర్తింపుగా ఢిల్లీలో జరిగిన 102వ స్కోచ్ అవార్డుల ప్రదానోత్సవంలో విశాఖ పోలీసులు ఈ అవార్డును స్వీకరించారు. ఈ విజయంతో హిట్ అండ్ రన్ కేసుల బాధితులు, వారి కుటుంబ సభ్యులు, నగర పోలీసు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి సేవా కేంద్రం ఏర్పాటు చేసినందుకు గాను కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలియజేశారు.



అమ్మవారి విగ్రహాలకు తుది మెరుగులను దిద్దుతున్న శిల్పులు



సర్ప సహిత దుర్గాదేవి విగ్రహం

నమో జగన్మాత..

- జోరుగా దేవీ విగ్రహాల అమ్మకాలు
- చౌడువాడలో 300 ప్రతిమల తయారీ
- ఉమ్మడి జిల్లా నుంచి వచ్చి కొనుగోలు

కె.కోటపాడు: ఊరూవాడా వినాయక నవరాత్రులు ముగిశాయి. ఇప్పుడు దేవీ శరన్నవరాత్రుల వేడుకలకు సిద్ధమైంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు దుర్గాదేవి విగ్రహాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరనున్నాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన ఉత్సవ కమిటీలు చౌడువాడలో దుర్గాదేవి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నాయి. ఇక్కడ పలు రూపాల్లో తయారైన ఆకర్షణీయమైన విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో తయారైన విగ్రహాలు నాణ్యతకు గీటురాయిగా నిలుస్తాయి. తయారుదారులు సైతం సామాన్యులకు అందుబాటులో ధరలు ఉంచటంతో మంచి గిరాకీ ఉంటోంది. ఏటా వినాయక విగ్రహాల తయారీ పూర్తయిన తర్వాత దుర్గాదేవి ప్రతిమలు సిద్ధం చేస్తుంటారు. 60 మంది శిల్పులు అమ్మవారి విగ్రహాలను ఆకట్టుకునే రూపాల్లో జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది 300 దుర్గాదేవీ విగ్రహాలను తయారీ చేయగా, విశాఖపట్నం, అనకాపల్లి, గాజువాక, తదితర ప్రాంతాల నుంచి వచ్చి జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

2 నుంచి 10 అడుగుల ఎత్తు విగ్రహాల తయారీ



ఏటా విజయదశమి సందర్భంగా దేవీ విగ్రహాలను తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నాం. 60 మంది యువకులతో పాటు మహిళలు వీటిని తయారీ చేస్తుంటారు. వివిధ రూపాల్లో దుర్గాదేవి విగ్రహాలను రెండు నుంచి పదడుగుల ఎత్తు వరకూ తయారీ చేస్తున్నాం. ఇవి రూ.3 వేల నుంచి రూ.15 వేల వరకూ అమ్ముడుపోతుంటాయి.

– బత్తిన నాగరాజు, విగ్రహాల శిల్పి, చౌడువాడ



శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన దుర్గాదేవి విగ్రహాలు



మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు



శివపార్వతీ సమేత దుర్గాదేవి అమ్మవారు

బలవంతపు భూసేకరణ ఆపాలి

చలో విజయవాడకు సీపీఎం నేత వెంకన్న పిలుపు

కె.కోటపాడు: బలవంతపు భూసేకరణ ఆపాలని ఈ నెల 24న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న పిలుపునిచ్చారు. మండలంలో ఆర్లిలో చలో విజయవాడ కరపత్రాలను ఆదివారం ఆయన రైతులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతు కూటమి ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేపట్టేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. రైతుల నుంచి తీసుకునే భూముల్లో పర్యావరణానికి హాని కలిగించే కంపెనీలను ఏర్పాటు చేసి కాలుష్యం వెదజల్లే చర్యలకు తెర తీయనున్నట్లు విమర్శించారు. కె.కోటపాడు మండలంలో ఎస్ఈజెడ్ ఏర్పాటుకు 1200 ఎకరాలు, బుచ్చెయ్యపేటలో 1691 ఎకరాలు బలవంతంగా సేకరించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. భూములు ఇవ్వబోమని, ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టవద్దని రైతుల నుంచి ప్రతిఘటన వస్తుందన్నారు. విజయవాడ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్లిలో కరపత్రాలను విడుదల చేస్తున్న వెంకన్న, తదితరులు

వాడనర్సాపురం తీరం నుంచి ఇసుక తరలింపు



వాడనర్సాపురం తీరంలో ఇసుక తవ్వకాలు, తరలింపు కోసం ట్రాక్టర్లు కదలాడిన ప్రదేశం

- ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న రెవెన్యూ వర్గాలు..?
- ఇసుక అమ్మకాలపై ఎస్పీకి స్థానికుల ఫిర్యాదు..!

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం వాడనర్సాపురం సముద్ర తీర ప్రాంతం నుంచి ఇసుక అక్రమ తరలింపుపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. మూడు రోజుల నుంచి ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు ప్రారంభించినట్లు సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇసుక తరలింపుపై స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోనప్పటికీ శనివారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న పోలీస్ సిబ్బందిపై రాజకీయ ఒత్తిడి తీసుకువస్తున్నారు.

గతంలోనే వెలుగులోకి తెచ్చిన సాక్షి..

గత నెల 23న వాడనర్సాపురంలో అనధికారంగా ఇసుక వేలం నిర్వహించిన అంశాన్ని సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. రూ.3 లక్షలకు వేలం దక్కించుకున్న పాటదారునితో పాటు సహకరించిన వారికి అప్పట్లో అధికారులకు హెచ్చరికలు జారీ చేయడంతో ఇసుక తరలింపును తాత్కాలికంగా నిలిపివేశారు. మళ్లీ మూడు రోజుల నుంచి ప్రారంభించడం గమనార్హం. ఏడాదిపాటు సముద్రంలోని ఇసుకను తవ్వేందుకు, కావాల్సిన వారికి విక్రయించేందుకు హక్కులు దక్కించుకున్న పాటదారునికి అధికార పార్టీ నేతలు సహకరిస్తున్నట్లు తాజాగా పోలీస్ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విశాఖ స్వరూపం మారుతుందా?

- పెందుర్తి అసెంబ్లీ పూర్తిగా విశాఖలో ఉంచాలనే ప్రతిపాదన
- విశాఖ ఎంపీ పరిధిలోని ఎస్.కోటనీ విలీనం చేసేందుకు సన్నాహాలు
- ప్రస్తుతం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పెందుర్తి నియోజకవర్గం
- నియోజకవర్గం మొత్తం విశాఖ జిల్లాలో ఉండాలని కూటమి నేతల విజ్ఞప్తులు
- త్వరలో మంత్రివర్గ ఉప సంఘం ముందు ప్రతిపాదనలు

మహారాణిపేట: జిల్లా సరిహద్దుల మార్పుపై ఊహాగానాలు పెరుగుతున్నాయి. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాన్ని పూర్తిగా, ఎస్.కోట అసెంబ్లీని పాక్షికంగా విశాఖ జిల్లాలో విలీనం చేసే ప్రతిపాదనలపై చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో జీవీఎంసీ పరిధి 89శాతం ఉండగా, గ్రామీణ ప్రాంతం కేవలం 11 శాతం మాత్రమే ఉంది. ఈ గ్రామీణ ప్రాంతాన్ని పెంచడం, అలాగే అవకాశం ఉన్న ప్రాంతాలను జీవీఎంసీలో విలీనం చేయడం వంటి ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి పునర్విభజన అంశాలను తీసుకువచ్చారు. పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి మండలం ఇప్పటికే విశాఖ జిల్లాలో ఉండగా, అదే నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాలను కూడా విశాఖ జిల్లాలో విలీనం చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై పరిశీలన చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఎస్.కోట

విశాఖ పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు విశాఖ జిల్లాలో ఉన్నాయి. విశాఖ తూర్పు, విశాఖ ఉత్తరం, విశాఖ దక్షిణం, విశాఖ పశ్చిమం, భీమిలి, గాజువాక. అయితే ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గం మాత్రం విజయనగరం జిల్లాలో ఉంది. ఈ పరిస్థితి వల్ల ప్రజల పరామర్శలు, పర్యటనలు, ఇతర కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పార్లమెంట్ సభ్యులు భావిస్తున్నారు. అందుకే ఎస్.కోటను విశాఖ జిల్లాలో విలీనం చేయడంపై అధ్యయనం జరుగుతోంది. ఒకే ఎంపీ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు ఒకే జిల్లాలో ఉంటే ఎలా ఉంటుందనే దానిపై వివిధ శాఖల అధికారుల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నారు.

జిల్లా భౌగోళిక స్వరూపంలో మార్పులు

ఒకప్పుడు పెద్ద జిల్లాగా ఉన్న విశాఖ ఇప్పుడు చిన్నగా మారింది. గతంలో మైదాన, గిరిజన, పట్టణ ప్రాంతాలు విశాఖ జిల్లాలో భాగంగా ఉండేవి. జిల్లాల విభజన తర్వాత గ్రామీణ ప్రాంతం తగ్గి, గిరిజన ప్రాంతం పూర్తిగా లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాలు తక్కువగా ఉన్న విశాఖ జిల్లాలో అదనపు ప్రాంతాలను కలిపితే ఎలా ఉంటుందనే దానిపై అధికార యంత్రాంగం పరిశీలిస్తోంది. ఈ చర్చలు విశాఖ జిల్లా భౌగోళిక స్వరూపాన్ని పూర్తిగా మార్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందులో భాగంగా, కొన్ని ప్రాంతాలను ఆయా జిల్లాల్లో కలపడానికి కసరత్తు జరుగుతోంది.



జిల్లా పునర్విభజన కమిటీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. వాటిలో కొన్నింటిని సవరించడానికి కూటమి ప్రభుత్వం ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. జిల్లాల సంఖ్యను పెంచడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా ఈ ఉప సంఘం పరిశీలిస్తోంది. జిల్లాల విలీనం, తొలగింపు వంటి అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తోంది.

ఐ ఫోన్ కొనలేదని యువకుడి ఆత్మహత్య



సాయిమారుతి కెవిన్(ఫైల్)

పెందుర్తి: తల్లిదండ్రులు ఐ ఫోన్ కొనలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుజాతనగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నాడు. అతని కుమారుడు సాయి మారుతి కెవిన్(26) కొంతకాలం హైదరాబాద్‌లో సినిమా పరిశ్రమలో పనిచేసి ఇటీవలే ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తనకు ఐ ఫోన్ కావాలని తండ్రిని సాయి అడుగుతున్నాడు. ఆదివారం కూడా ఈ విషయంపై తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం తన గదిలోకి వెళ్లిన కెవిన్ సాయంత్రమైనా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపును బలవంతంగా తెరడంతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. హతాశులైన తల్లిదండ్రులు అతడ్ని కిందకు దించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కెవిన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ స్వామి నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యాసిడ్ లారీని ఢీకొట్టిన బస్సు

గ్యాస్ లీక్ • సకాలంలో రక్షణ చర్యలు



లారీని ఢీకొట్టిన బస్సు (ఇన్‌సెట్‌లో) రోడ్డుపై నిలిచిపోయిన యాసిడ్ లారీ

నక్కపల్లి: జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి పెద్ద ప్రమాదం తప్పింది. అనకాపల్లి నుంచి తుని వైపు సల్ఫ్యూరిక్ యాసిడ్‌తో వెళ్తున్న లారీ రిపేరు రావడంతో డ్రైవరు టోల్‌గేట్ సమీపంలో రోడ్డు మధ్యలో నిలిపివేశాడు. లారీలో యాసిడ్ ఉన్న విషయం తెలిసినప్పటికీ డ్రైవర్ కానీ, క్లీనర్ కానీ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు. లారీ పక్కన నిలబడి హెచ్చరించడం, అడ్డంగా ఏదైనా వస్తువులు సైతం పెట్టలేదు. లారీని పక్కన ఆపేసి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అదే సమయంలో విశాఖ నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న మరో వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఆగి ఉన్న యాసిడ్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం బాగా దెబ్బతింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. అదేవిధంగా యాసిడ్ లారీ ట్యాంకర్ నుంచి గ్యాస్ లీకైంది. దీంతో రహదారిపై రాకపోకలు సాగించేవారు చాలా భయాందోళనలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన వెళ్లి గ్యాస్ లీక్ కాకుండా చర్యలు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

విద్యుత్ లోపాలకు AIతో చెక్

- ఈపీడీసీఎల్ వినూత్న ఆలోచనలు
- సాంకేతికత దన్నుతో విద్యుత్ వ్యవస్థలో లోపాల నవరణ
- ఇప్పటికే ఫ్రంట్ లైన్ కార్యకలాపాల్లో ఏఐ వినియోగం
- విద్యుత్ స్తంభాల్లో లోపాల్ని స్మార్ట్‌ఫోన్ కెమేరాతో పసిగట్టేలా వ్యవస్థ
- విద్యుత్ డిమాండ్‌ని ఇట్టే పసిగట్టే ఏఐ సాంకేతికత

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ వ్యవస్థలో సమస్యలను వేగంగా పరిష్కరించడానికి, ఏపీఈపీడీసీఎల్ సరికొత్త ఆవిష్కరణలను చేపడుతోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, విద్యుత్ సరఫరాను మెరుగుపరచడానికి కృత్రిమ మేధస్సును వినియోగిస్తోంది. విద్యుత్ సరఫరా, స్తంభాల లోపాలు, డిమాండ్ అంచనా వంటి కార్యకలాపాల్లో ఏపీఈపీడీసీఎల్ ఇప్పటికే ఏఐని ఉపయోగిస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి, క్షేత్రస్థాయి సమస్యలను కనిపెట్టడానికి కూడా ఈ సాంకేతికతను ఉపయోగిస్తోంది.

ఏఐతో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం

కొద్ది నెలలుగా ఏపీఈపీడీసీఎల్ తమ ఫ్రంట్‌లైన్ కార్యకలాపాల్లో ఏఐని ఉపయోగించి అద్భుతమైన ఫలితాలను సాధించింది. విద్యుత్ వ్యవస్థకు ఏఐ సాంకేతికతను అనుసంధానించడం వల్ల సమస్యల పరిష్కారం మరింత సులభమైంది. ఈ కొత్త వ్యవస్థను ఏపీఈపీడీసీఎల్ ఐటీ ఇంజినీర్లు, ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు, బెంగళూరుకు చెందిన జోనాయిక్ అనే స్టార్టప్ సంస్థ సంయుక్తంగా రూపొందించాయి. ఈ ఏడాది మార్చిలో ఏపీఈపీడీసీఎల్ డేటా సెంటర్‌లో ఒక ఏఐ సర్వర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సర్వర్‌ను స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానించి, విద్యుత్ సరఫరాలో లోపాలను సరికొత్త సాంకేతికతతో పరిష్కరించే ప్రయోగాల్లో విజయం సాధించారు.

స్మార్ట్‌ఫోన్ కెమెరాతో స్తంభాల లోపాలు కూడా

జోనాయిక్ స్టార్టప్ సంస్థ సీఈవో శశాంక్ చిలంకుర్తి మార్గదర్శకత్వంలో విద్యార్థులు జీపీయూ ప్రోగ్రామింగ్, ఏఐ వర్క్‌ఫ్లో ఫ్రేమ్‌వర్క్‌పై శిక్షణ పొందారు. అలాగే, ఏపీఈపీడీసీఎల్ ఐటీ టీమ్‌ను కూడా వాన్ శ్రీనివాస్ సుశిక్షితుల్ని చేశారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఏ సమస్య తలెత్తిందో లైన్‌మెన్ల సహకారంతో ఏఐ ద్వారా గుర్తించడంలో 100 శాతం విజయం సాధించారు. పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, గ్రిడ్స్ వద్ద ఎక్కడైనా లోపం ఉంటే, స్మార్ట్‌ఫోన్ కెమెరా ఉపయోగించి క్షణాల్లో కనిపెట్టే వ్యవస్థను రూపొందించారు. ఇన్సులేటర్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నా వెంటనే ఏఐ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు. ఈ స్టార్టప్ సంస్థ, ఏపీఈపీడీసీఎల్ కోసం ఒక ప్రైవేట్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కోడ్‌ను రూపొందిస్తోంది. దీని ద్వారా విద్యుత్ సరఫరాలో లోపాలను ముందుగానే అంచనా వేసి, సంబంధిత ఆపరేటర్లకు సమాచారం చేరవేస్తుంది. ఈ వ్యవస్థ వల్ల సరఫరాలో లోపాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

మీటర్ల లోపాలను కూడా పసిగట్టే ఏఐ

స్మార్ట్ మీటర్ల డేటాను అంచనా వేయడానికి కూడా ఏఐని ఉపయోగిస్తున్నారు. ఈ డేటా సహాయంతో తప్పుడు రీడింగ్‌లు నమోదు చేస్తున్న మీటర్లను సులభంగా పసిగట్టవచ్చు. దీనివల్ల ఏపీఈపీడీసీఎల్‌కు కలిగే ఆదాయ నష్టాన్ని తగ్గించగలుగుతున్నారు. అంతేకాకుండా, ఏఏ ప్రాంతాల్లో లో–వోల్టేజ్ సమస్యలు ఉన్నాయో ఏఐ రియల్–టైమ్ మానిటరింగ్, గ్రాఫ్ విశ్లేషణల ద్వారా సమాచారాన్ని అందిస్తోంది.

ఈ వ్యవస్థను సైబర్ దాడుల నుంచి రక్షించడానికి పటిష్టమైన యాంటీవైరస్ వ్యవస్థను కూడా రూపొందించారు. స్మార్ట్ మీటర్లు, ఫీడర్ నిర్వహణ, విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సేకరించిన డేటాను ఏకీకృత డేటా లేక్ వ్యవస్థలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇది ఓవర్‌లోడ్‌లను ముందుగానే గుర్తించడాన్ని మరింత సులభతరం చేసింది.



సీఎండీ పృథ్వీతేజ్ సమక్షంలో ఏఐ వ్యవస్థని ఈపీడీసీఎల్‌కు అందిస్తున్న జోనాయిక్ స్టార్టప్ సంస్థ ప్రతినిధులు

పోల్ నుంచి.. డిమాండ్ సరఫరా వరకూ..



రాష్ట్ర స్థాయిలో దీర్ఘకాలిక డిమాండ్ అంచనా, సామర్థ్య ప్రణాళికల కోసం ఇప్పటికే ఈపీడీసీఎల్ పరిధిలో ఏఐని విజయవంతంగా అమలు చేస్తున్నాం. భవిష్యత్తు విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళిక, ఖర్చుల్ని ఆప్టిమైజ్ చేయగలుగుతున్నాం. స్మార్ట్‌మీటర్ ఇంటిగ్రేషన్‌తో ఇప్పుడు ఫీడర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో స్థానికంగా డిమాండ్ అంచనాల్ని కూడా కనుగొనే సాంకేతికతని అందిపుచ్చుకున్నాం. ఓవర్‌లోడ్‌ని ముందుగానే గుర్తించడం, సకాలంలో లోడ్ షెడ్డింగ్ మొదలైన అంశాలపై మరింత చురుగ్గా వ్యవహరించేలా ఈపీడీసీఎల్ నిరంతరం సేవలందించేందుకు సిద్ధమైంది. ఏఐ వినియోగం ద్వారా విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరగడంతో పాటు.. సిబ్బందికి.. లోపాలు పరిష్కరించే మార్గాలు మరింత సులువవుతుండటం శుభపరిణామం.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈపీడీసీఎల్ సీఎండీ

క్లుప్తంగా

జీవామృతంతో చీడపీడల నివారణ



జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాలలో రైతులకు జీవామృతం తయారీ విధానంపై ప్రకృతి వ్యవసాయం జిల్లా మార్కెటింగ్ మాస్టర్ శిరసపల్లి అప్పరాజు అవగాహన కల్పించారు. ఆదివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవామృతం తయారీ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి 15 రోజులు ఒకసారి నీటితో జీవామృతాన్ని పిచికారీ చేయడంతో పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఎటువంటి చీడపీడలు దరి చేరవని, పంట దిగుబడి బాగుంటుందన్నారు. పకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మజ్జి సత్యారావు, మల్ల నాగేశ్వరరావు, ఐసీఆర్పీలు సంతోష్, సాయి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్

అనకాపల్లి: మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సాలాపు శాంతి సూరిఅప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ అప్‌డేట్, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు మరోసారి అప్‌డేట్ చేయించాలన్నారు. అడ్రస్ మార్పులు చేర్పులు వంటి సవరణలు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి నాటికల ప్రదర్శన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పార్కుసెంటర్ గౌరీ సేవా సంఘంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ వారిచే 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం' పద్య నాటకం, 23న సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన యంగ్ థియేటర్ అర్గనైజేషన్ వారిచే '27వ మైలురాయి' నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు జిల్లా కైకలూరు సాయి ఆర్ట్స్ వారిచే ' జనరల్ బోగీలు' నాటిక, 24న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన మల్లాది క్రియేషన్స్ వారిచే 'ఆవేశంలో ఆనందం' హాస్య నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు అభినయ్ ఆర్ట్స్ వారిచే 'ఇది అతని సంతకం' నాటిక, 25న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, గోవాడ క్రియేషన్స్ వారిచే 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు వారిచే 'నాన్న' నాటిక, 26న సాయంత్రం 6 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారిచే ' విడాకులు కావాలి' నాటిక, రాత్రి 8 గంటలకు విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్ వారిచే 'భువి కోరని భ్రమణం' నాటికలు ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. నాటికల పర్యవేక్షకులుగా కె.ఎం.నాయుడు, మళ్ల సూరిబాబు వ్యవహరిస్తారన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 64 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,850	4,930
రెండో రకం	-	-
మూడోరకం	3,600	3,650

అనకాపల్లి సినిమాలు

రాజా	: భద్రకాళి
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: బ్యూటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4, బీ పాజిటివ్-11, ఓ పాజిటివ్-22, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 228 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

ఆరుబయట భోజనాలు

- కశింకోట బాలికల హైస్కూలులో దుస్థితి
- పట్టించుకోని కూటమి పాలకులు



మధ్యాహ్న భోజనం వడ్డన (ఫైల్)



డైనింగ్ హాలు లేక ఆరుబయట మధ్యాహ్న భోజనం చేస్తున్న బాలికలు (ఫైల్)



దిగువ స్థాయిలో మోటారు షెడ్



పాఠశాల ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీటిలో ఇబ్బంది పడుతూ వెళ్తున్న బాలికలు (ఫైల్)

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇక్కడ విద్యార్థినులకు కనీసం డైనింగ్ హాలు సౌకర్యం లేదు. దాంతో ఆరు బయట, తరగతి గదులు, వరండాల్లో భోజనం చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. సుమారు 600 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి స్కూలుగా గుర్తింపు పొందింది. అయినప్పటికి డైనింగ్ హాలు నిర్మాణం గురించి అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్థానిక బాలికల హైస్కూలులో స్థానికుల కంటే ఉమ్మడి జిల్లాలకు చెందిన పలు గ్రామాల నుంచి వచ్చి బాలికలు చదువుతున్నారు. 400 మంది పైగా స్థానికేతర విద్యార్థినులు ఇక్కడ చదువుతున్నారు. ఎక్కువగా చింతపల్లి, పాడేరు, తదితర ఏజెన్సీ ప్రాంత విద్యార్థినులు చేరి విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ విద్యా బోధన బాగుండటం, రవాణాకు అనువుగా ఉండటం, స్కూలుకు చేరువలోనే సమగ్ర బాలికల వసతి గృహం అందుబాటులో ఉండటంతో ఏజెన్సీ విద్యార్థినులు ఎక్కువగా ఇక్కడ చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. మైదాన ప్రాంతంలో నాగరికత, భాష మాట్లాడే తీరు మెరుగుపడతాయని భావించి తల్లిదండ్రులు ఇక్కడ ఎక్కువగా చేర్పిస్తున్నారు. వీరితోపాటు స్థానికులు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థినులు చదువుతున్నారు. దీన్ని పీఎంశ్రీ కింద మొదటి విడతతో ఎంపిక చేశారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పాఠశాలలో డైనింగ్ హాలు లేదు. దీంతో ఆరుబయట ఎండలోను, తరగతి గదులు, వరండాలోను, అసెంబ్లీ స్టేజి మీద భోజనాలు చేయాల్సిన పరిస్థితిని బాలికలు ఎదుర్కొంటున్నారు. దీంతో తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

ఎంపీ ఆదేశాలతో సరి!

ఇటీవల స్కూలును సందర్శించిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎంపీ స్పందిస్తూ డైనింగ్ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, ఇందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని ఆదేశించారు.

తాగునీటికి కటకట..

తాగునీటి కొరతను విద్యార్థినులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మోటారు పాడు కావడం, వర్షం నీరు మోటారు షెడ్డు దిగువగా ఉండటం వల్ల దానిలోకి వెళ్లిపోవడంతో మరమ్మతులకు అవకాశం లేక నీటి సమస్యను ఎదుర్కొన్నారు. దీంతో ఇంటి నుంచి, సమగ్ర బాలికల వసతి గృహం నుంచి నీరు తెచ్చుకొని తాగాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకు తెచ్చి నీటిని అందించారు. ఆ తర్వాత మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీనిదృష్ట్యా మోటారు షెడ్డును ఎత్తుగా నిర్మించాల్సి ఉంది.

వర్షం పడితే ఇబ్బందులు

స్కూలు ప్రాంగణంలో వసతి గృహానికి వెళ్లే వైపు వర్షం వచ్చిందంటే పల్లంగా ఉండటం వల్ల నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ఇక స్కూలులో క్లర్క్ లేరు. దీంతో స్కూలు రికార్డు వర్కను ఉపాధ్యాయులే నిర్వహించాల్సి వస్తోంది. దీని దృష్ట్యా క్లర్క్‌ను నియమించాల్సి ఉంది. ప్రధానమైన డైనింగ్ హాలు నిర్మాణంతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం

హైస్కూలులో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాలు అవసరముంది. ఈ విషయాన్ని అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించారు.

– ఎం.ఎస్. స్వర్ణకుమారి, హెచ్ఎం, బాలికల హైస్కూలు

మురుగు కూపంలో ఎన్టీఆర్ కాలనీ



డ్రైనేజీ లేక మురుగు నిల్వ

అనకాపల్లి: కూటమి పాలనలో పలు గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక పరిసరాలు మురుగు కూపంగా మారుతున్నాయి. మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ 40 కుటుంబాలు డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లలో వాడుక నీరు నిల్వ ఉండిపోయి మురుగు కూపంగా మారుతోంది. దాంతో వెలువడిన దుర్వాసనతోపాటు ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పర్యవసానంగా వ్యాధులు బారిన పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఇప్పటికైన పంచాయతీ రాజ్ ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి డ్రైనేజీని నిర్మించాలని కోరుతున్నారు.

రైఫిల్ షూటింగ్‌లో విద్యార్థులు



రైఫిల్ షూటింగ్‌లో పాల్గొననున్న విద్యార్థులు

పరవాడ: మండలంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తమిళనాడులో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. పాఠశాలకు చెందిన సంజయ్‌రెడ్డి, లిత్విక్, హర్షితనాయకర్ ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి ఆకాంక్షించారు.



గవరపాలెం పార్కు సెంటర్ వద్ద కనకదుర్గమ్మ పందిరి



గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ రహదారి



వేల్పులవీధి రజకుల కాలనీలో ఏర్పాట్లు

దసరా ఉత్సవాలకు ముస్తాబు

- పట్టణం, మండలంలో సిద్ధమైన ఆలయాలు
- ప్రత్యేక మండపాల్లో కొలువుదీరనున్న అమ్మవారు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు



శివశక్తి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల పందిరి



సత్యనారాయణపురం కనకదుర్గమ్మ



గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ



కశింకోటలోని శివాలయంలో సర్వమంగళాంబ



కశింకోట వద్ద ఆలయంలో వెలసిన కనకదుర్గమ్మ

అనకాపల్లి: హిందువులకు ముఖ్యమైన పండగ దసరా.. దీనికి ఊరూవాడా సిద్ధమైంది. ఈ మేరకు ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువైన అమ్మవారు పూజలందుకోనున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇప్పటికే ఆలయాలను వివిధ రకాల పూలు, తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.

కనకదుర్గ ఆలయ చరిత్ర

మండలంలో సత్యనారాయణపురం కొండపైన 1984లో కనకదుర్గ ఆలయానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా కొండపైకి భక్తులు చేరుకునేందుకు 260 మెట్లను 2000లో పూర్తి చేశారు. వృద్ధులు, దివ్యాంగులు మట్ల మార్గాన పైకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండగా, 2015లో కొండ కింద నుంచి పైకి ఘాట్‌రోడ్డు నిర్మించారు. ఇక్కడ 2007 నుంచి ప్రతి శుక్రవారం 50 మందితో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం ప్రస్తుతం 500 మందికి అందిస్తున్నారు. తాజాగా శరన్నవరాత్రులకు రోజూ మధ్యాహ్నం 1500 మందికి అన్నసమారాధన ఏర్పాటు చేస్తారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ....

2016లో స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయాన్ని పి.వి.రమణ, కాండ్రేగుల జగన్నాథరావు భక్తుల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. కాండ్రేగుల నాయుడు ఆధ్వర్యంలో ఏటా దేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నారు. గవరపాలెం గౌరీపరమేశ్వరుల దేవాలయంలో 20 సంవత్సరాలుగా దసరా వేడుకల్లో భవానీ, అయ్యప్పస్వామి, ఇతర మాలాధారణ భక్తులకు రోజూ మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెల 2న కనకదుర్గమ్మ విగ్రహాన్ని 25 ట్రాక్టర్లతో పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ ఊరేగింపులో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, కేరళ కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

వేల్పులవీధి రజకుల కాలనీలో...

స్థానిక వేల్పులవీధి రజకుల కాలనీలో కనకదుర్గమ్మను 1976లో అప్పటి పెద్దలు స్వర్గీయ నేలతేటి అప్పారావు ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణంలో అప్పటి పెద్దలు అప్పలకొండ, రాజారావు, టేకు అప్పారావు కొంతమంది భక్తుల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఆలయం నిర్మించి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా హనుమంతరావు ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

నూకాంబిక ఆలయంలో....

ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 3 వరకు ఆలయంలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

కశింకోట: స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు ముస్తాబు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భవానీ భక్తులు వచ్చి మాలధారణ చేయనుండటంతో అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపకుడు నడిగట్ల ప్రసాద్‌బాబు తెలిపారు. ఉచిత మాలధారణ, దర్శనం, కేశ ఖండనతోపాటు ప్రత్యేక దర్శనాన్ని భవాని భక్తులకు కల్పిస్తున్నామన్నారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. స్థానిక శివాలయంలోని సర్వమంగళాంబ ఆలయంలో అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామని అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు.

బేస్‌బాల్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

మాకవరపాలెం: ఉన్నత పాఠశాల విద్యార్థులు బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపారు. పరవాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో బేస్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఐదుగురు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. భీమిలిలో జరిగిన పోటీల్లోనూ ఆరుగురు విద్యార్థులు ఈ పాఠశాల నుంచి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు డి.రవి, చంద్రదేవితో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

24న 'చలో విశాఖ డెయిరీ'

కె.కోటపాడు : ఈ నెల 24న విశాఖ డెయిరీ సర్వసభ్య సమావేశం వద్దకు పాడి రైతులంతా చలో విశాఖ డెయిరీ కార్యక్రమం పేరిట పెద్ద సంఖ్యలో హాజరై పాడి రైతుల కష్టాలను తెలియజేయాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. ఆనందపురం గ్రామంలో ఆదివారం చలో విశాఖ డెయిరీ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయినిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విశాఖ డెయిరీపై హౌస్ కమిటీని నియమించిందని, ఈ కమిటీ నిజాలను వెలికితీసి దోషులను శిక్షించాలని ఆయన కోరారు. రైతుల పాలకు చెల్లిస్తున్న ధరకు అదనంగా లీటర్‌కు రూ.10లను పెంచేలా డెయిరీ చర్యలను చేపట్టాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులపై చర్యలు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు భద్రం

అనకాపల్లి: పట్టణంలో ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారుల పొట్ట కొట్టడం అన్యాయమని సీపీఐ జిల్లా నాయకుడు వైఎస్.భద్రం తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రెక్కాడితే గాని డొక్కాడని చిరువ్యాపారులపై జోనల్, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. బడా వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి, వ్యాపారాలు చేస్తుంటే చోద్యం చూస్తున్న అధికారులు వీరిపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. చిరువ్యాపారాలు చేసుకునేందుకు ప్రత్యేక స్థలాన్ని చూపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జోనల్ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు, నాయకులు కోరుబిల్లి శంకరరావు శ్రీరామదాసు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు



యూపీహెచ్‌సీ వైద్యాధికారితో ఆశ వర్కర్లు

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో మహిళలు పాల్గొనాలని గవరపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు ప్రశాంతి కోరారు. స్థానిక గవరపాలెం అరుంధతీనగర్ యూపీహెచ్‌సీలో ఆశవర్కర్లు, మహిళలకు ఆదివారం ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ వృద్ధులకు, మహిళలకు, గర్భిణులకు, కౌమార బాలికలకు, చిన్నారులకు అన్ని రకాల క్యాన్సర్‌పై వార్డు పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు శూన్యం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనకాపల్లి టౌన్: గాంధీనగరంలో సాయిశక్తి ప్రైవేటు స్కూల్‌లో జరిగిన సంఘటనపై విద్యా శాఖ అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్ విమర్శించారు. స్థానిక ప్రైవేట్ హాల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ అభం, శుభం ఎరుగని విద్యార్థులను దారుణంగా కొట్టడం గర్హనీయమన్నారు. ఇష్టంతో చదువు చెప్పాలని భయంతో చెబితే రాదన్నారు. తక్షణమే పాఠశాలపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ విభాగం కన్వీనర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోర్‌పై సంతకాల సేకరణ



సంతకాలు సేకరణ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

అనకాపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూచౌక్ వద్ద 'ఓటు చోర్ గద్దీ చోడ్'పై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అనేక పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో ఓటరు జాబితాల్లో బోగస్ ఓట్లు చేర్చబడ్డాయని, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వాళ్ల ఓట్లు తొలగించబడ్డాయని వాపోయారు. రాహుల్ గాంధీ మీడియా దృష్టికి తీసుకొచ్చినా ఎన్నికల సంఘం నుంచి స్పందన రాకపోవడం చూస్తుంటే అనుమానాలకు తావిస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మలపు రెడ్డి కోటేశ్వరరావు, తుట్టా రమణ, సేనాపతి రాజు, బోయిన భానుమూర్తి యాదవ్, కశింకోట మండల అధ్యక్షుడు కత్తెర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 126 అడుగుల వినాయకుడికి నిమజ్జనం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల లక్ష్మీగణపతి నిమజ్జనోత్సవం సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు బుద్ధ భూలోకనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి గణపతికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సాయంత్రం రెండు ఫైర్ ఇంజన్లు సహాయంతో స్వామివారి నిమజ్జనం జరుగుతుందన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడిన లారీ



మండల కాంప్లెక్సు సమీపంలో బోల్తా పడిన లారీ

పరవాడ: లంకెలపాలెం-పరవాడ రహదారిలో మండల కాంప్లెక్స్ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ఓ బూడిద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన లారీ క్లీనర్ నరమల వంశీ గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్ సంతోష్ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు. ఎన్టీపీసీ నుంచి బూడిదను లోడు చేసుకుని ఘాట్ రోడ్డుకు వెళ్లడానికి బయలుదేరిన బూడిద లారీ పరవాడ మండల కాంప్లెక్సు వద్దకు రాగానే వేకువ జాము 3 గంటల సమయంలో డ్రైవర్ నిద్ర మత్తు వల్ల రోడ్డు పక్క విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది.